క్లుప్తంగా

కళాశాలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్



కళాశాలలో ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాలల్లో ఈనెల16వ తేదీ లోగా అడ్మిషన్‌లు పొందాలని ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ తెలిపారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో కౌన్సెలింగ్ ద్వారా సీటు పొందిన విద్యార్థులు వారి యొక్క ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలలకు వచ్చి అడ్మిషన్‌లు పొందాలన్నారు. ఆయా కళాశాలల్లో జరిగిన కౌన్సిలింగ్‌లో వైస్ ప్రిన్స్‌పాళ్లు పట్టాసి చలపతిరావు, డాక్టర్ కె.పుష్పరాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

178 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరానికి హాజరైన గిరిజనులు

అరకులోయటౌన్: మండలంలోని సుంకరమెట్ట పీహెచ్‌సీలో సోమవారం వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ , గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 178 మంది రోగులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 36 మందికి ఈసీజీ, 53 మందికి ఇతర పరీక్షలు చేశారు. వైద్యులు మణికంఠ, గౌతమ్, ఉపేంద్ర తదితరులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ట్రస్ట్ కో–ఆర్డినేటర్ వైఎస్ రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన

కొయ్యూరు: మండలంలోని సింగవరం షిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. గ్రామస్తుడు జె.వి.గిరిబాబు తన తండ్రి జె.అప్పారావు జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. గణబాబు, నాగేశ్వరరావు, గోవింద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


విద్యాహక్కు చట్టాన్ని సక్రమంగా అమలుచేయాలి



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చింతపల్లి: ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని గిరిజన సమైక్య జిల్లా నాయకులు కంకిపాడు సత్తిబాబు డిమాండ్ చేశారు. సోమవారం చింతపల్లి ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగాయి. జిల్లా నాయకులు సత్తిబాబు హాజరై జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యను పటిష్ట పరచడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం, మెరుగైన విద్యను అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్పష్టం చేశారు. నాయకులు సురేష్, రాజేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



ఎన్.సత్యనారాయణ (ఫైల్)

జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీ ఎన్.కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న నుర్మని సత్యనారాయణ(59) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గత కొన్ని రోజుల నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నుర్మతి గ్రామానికి చెందిన సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్యనారాయణ మాష్టార్ మృతికి ఎంఈవో సీహెచ్ బాబూరావుపడాల్, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబిడి శ్యామసుందరం, సహచర ఉపాధ్యాయులు తదితరులు సంతాపాన్ని తెలియజేశారు.



దుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



జి.మాడుగులలోని సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమేష్



దేవపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మత్తుతో జీవితాలు చిత్తు

- నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన
- గ్రామాల్లో ర్యాలీలు

అరకులోయ టౌన్: నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు పాఠశాలలో సోమవారం విద్యార్థులకు గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా అరకులోయలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి గంజాయి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ మత్తుతో జీవితాలు చిత్తు అవుతాయన్నారు. సీఐ రుద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, ఎస్ఐ సంతోష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సాటూరు–భద్రాచలం జాతీయ రహదారిపై గంజాయి సాగు నివారించాలని భారీ ర్యాలీతో పాటు మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో శెట్టి సుందరరావు మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయితో పట్టుబడి జైలుకెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఈ సందర్భంగా గంజాయి వద్దు..విద్యే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు.



అరకులోయలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ రుద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు

కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఉన్న పాఠశాల హెచ్ఎం కృష్ణారావు, నాగేంద్ర, పూర్ణేశ్వరావు, కిల్లో సరోజిని, లక్ష్మి, రమేష్, అప్పలనాయడు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్(హుకుంపేట): ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశాలమేరకు 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలను వ్యతిరేకించాలని ప్రతిజ్ఞ చేశారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరవచ్చన్నారు.

జి.మాడుగుల: యువత చెడు వ్యవనాలకు బానిసై జీవితాలు పాడు చేసుకోవద్దని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ రమేష్ తెలిపారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వర్తక, వాణిజ్య సంఘాలు, మోటార్, ఆటో యూనియన్‌లు, వివిధ శాఖల అధికార్లు, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు,అధ్యాపకులు, మీడియాలతో ఆయన కమ్యూనిటీ బిల్డింగ్ ఎక్సర్‌సైజ్ కమిటీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ యువత వ్యవసనాల బారిన పడి జీవితాలు పాడు చేసుకోవడమే కాకుండా వ్యవస్థను కూడా నాశనం చేస్తున్నారన్నారు. గంజాయి, మత్తు రహిత మండలంగా జి.మాడుగులను తీర్చిదిద్దటమే ఈ కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులు మత్తు వంటి వ్యసనాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. మండలంలో కొన్ని శాఖ అధికారులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులను గ్రూపుగా ఏర్పాటు చేసి, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకునేలా చూస్తామన్నారు ఎస్ఐ శ్రీనివాస్, గురుకులం ప్రిన్సిపాల్ పారయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రవిచంద్రశేఖర్, డాక్టర్ శశకాంత్, గురుకులం ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహ వార్డెన్ రవి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, వ్యాపార, వాణిజ్య సంఘాల ప్రతినిధులు, మోటార్, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: గిరిజన విద్యార్థులు, యువత గంజాయి, మధ్యం, దూమపానం వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని గూడెంకొత్తవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం మండల కేంద్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గూడెం కొత్తవీధి పాఠశాలలో ఆయన ఎస్ఐ అప్పలసూరితో కలసి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చింతపల్లి: గిరిజన యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని చింతపల్లి అదనపు ఎస్ఐ రమణ అన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులకు గంజాయి సాగు, రవాణా వల్ల కలిగే నష్టాలు, పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇదే కార్యక్రమంలో భాగంగా చింతపల్లి ఎంపీడీవో వీరసాయిబాబు చింతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



జీకే వీధిలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



చింతపల్లిలోని మాట్లాడుతున్న అదనపు ఎస్ఐ రమణ

కొయ్యూరు తహసీల్దార్‌గా తిరుమలరావు



కొయ్యూరు: కొయ్యూరు మండల తహసీల్దార్‌గా తిరుమలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత నాలుగు సంవత్సరాల నుంచి కొయ్యూరు తహశీల్దారుగా పనిచేసిన అతనిని ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మరో ప్రాంతానికి బదిలీ అయ్యారు. తిరిగి అధికారులు అతనిని కొయ్యూరు తహసీల్దారుగా నియమించారు.ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేస్తామన్నారు. ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

16 నుంచి రెవెన్యూ గ్రామసభలు



సత్యనారాయణ ఇన్‌చార్జ్ తహసీల్దార్

రాజవొమ్మంగి: మండలంలోని 62 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు రాజవొమ్మంగి ఇన్‌చార్జి తహసీల్దార్ ఎ.సత్యనారాయణ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మూడు రోజుల పాటు ఈ సభలు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలు ఉన్న వారు ఈ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను మండల అధ్యక్షుడు గణేష్ ఆవిష్కరించారు. అనంతరం మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడి, సమస్య లను తమ వంతు పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని, హెల్త్ అసిస్టెంట్లు, వర్కర్లు, వాచ్‌మెన్‌లను నియమించాలన్నారు. జీవో నెంబర్ 3 ను చట్టబద్ధత కల్పించడంతో పాటు మన్యంలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. సంఘ సభ్యులు జీవన్, ఇమాన్యుయే లు, వంశీ, దిలీప్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: మండలంలోని భీమవరం, ములగలమెట్ట, రామరాజుపాలెం, వలసంపేట, తీగలమెట్ట ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి సోమవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. స్టాకులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలకు వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. ఆరోగ్య భద్రతపై సూచనలిచ్చారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. రక్తహీనత సమస్య లేకుండా ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ వర్కర్లు విధిగా ప్రతీ నెల పిల్లల ఎత్తు, బరువును కొలవాలని, పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అరకులోయటౌన్: స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ లైబ్రేరియన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు.కళాశాలలో ఉన్న గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలేజీ లైబ్రేరియన్ కె.కామేశ్వరరావు, గ్రంథాలయ ఇన్‌చార్జి పి.కొండబాబు మాట్లాడుతూ లైబ్రేరియన్ డే ప్రాధాన్యతను వివరించారు. కళాశాల గ్రంథాలయంలో ఉన్న విలువైన పుస్తకాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. ఐక్యూఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కొండబాబు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె. పుష్పరాజు, పట్టాసి చలపతిరావు, అధ్యాపకులు విజయలక్ష్మీ, సుందరిరాణి విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత



గుండాలకాలనీలో కళాజాత ప్రదర్శనలో మాట్లాడుతున్న వైద్యులు

ఎటపాక: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు మండలంలోని నెల్లిపాక పీహెచ్‌సీ పరిధిలోని గుండాలకాలనీ, నెల్లిపాక గ్రామాల్లో సోమవారం కళాజాత నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, టైఫాయిడ్, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో వ్యాధులను దూరం చేయవచ్చని తెలిపారు. మురుగునీటి నిల్వల ద్వారా దోమలు పెరిగి వ్యాధులకు కారకాలుగా మారతాయని, వాటి నిర్మూలన పరిశుభ్రతతోనే సాధ్యమని చెప్పారు. రాజమండ్రి వీఎస్ఆర్ కళా బృంద సభ్యులు నాటిక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రత్యూష్, హెచ్‌వి సీతమ్మ, సిబ్బంది రాజేష్, ఆదిలక్ష్మి, జయ, సంధ్య, గంగరాజు, లక్ష్మి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తం



హుకుంపేటలో జరిగిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పూర్ణిమ



క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

హుకుంపేట: టీబీ(క్షయ) వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్త పడాలని, 18 సంవత్సరాలు నిండినవతి ఒక్కరై బాశిలాస్ కాల్మేట్ గ్వేరిన్(బీసీజీ) వ్యాక్సిన్ వేసుకోవాలని సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గిరిజనులు క్షయపై అవగాహన కలిగి ఉండాలన్నారు. టీబీ లక్షణాలు కలిగిన వారు ఆస్పత్రుల్లో కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: క్షయ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రత్యూష అన్నారు. అడ్డతీగల సబ్ సెంటర్ పరిధిలో సోమవారం క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రధాన వీధుల్లో ర్యాలీగా వెళ్లి అవగాహన కల్పించారు. మద్యపానం, ధూమపానం అలవాటు కలిగిన వారితో పాటు రక్తపోటు, సుగర్ వ్యాధి కలిగిన వాళ్లు ముందస్తుగా బీసీజీ వ్యాక్సిన్ వేయించుకుంటే మంచిదని సూచించారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న వారి కుటుంబీకులు కూడా ఈ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల రక్షణ పొందవచ్చన్నారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా దోమల మందు పిచికారీ



బ్యాంకు వీధిలో స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న అధికారి సూరిబాబు

గంగవరం : పిడతమామిడి, గంగవరం పీహెచ్‌సీల పరిధిలో ఎంపిక చేసిన గ్రామాల్లో దోమలు నిర్మూలనకు రెండో విడత స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ముమ్మరం చేసినట్టు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జి.సూరిబాబు తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో సోమవారం స్ప్రేయింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 23 గ్రామాల్లో స్ప్రేయింగ్ నిర్వహిస్తామన్నారు. గంగవరం పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటి వరకు తొమ్మిది గ్రామాల్లో స్ప్రేయింగ్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మండలంలో ఐదు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ పూర్తయినట్టు తెలిపారు. హెల్త్ అసిస్టెంట్లు రామకృష్ణ , అప్పలస్వామి, పద్మప్రియ, రామాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల వితరణ



వినాయకుని విగ్రహాన్ని అందజేస్తున్న వెంకట్రామయ్య

రాజవొమ్మంగి: ముర్లవానిపాలెం లోని గుబ్బలమంగమ్మ గుడిలో ప్రతిష్ఠించేందుకు అడ్డతీగల పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకట్రామయ్య వినాయకుని విగ్రహం అందజేశారు. జడ్డంగి, రాజవొమ్మంగి ప్రాంతాల్లో ఈనెల 20న వినాయకుని విగ్రహంతో పాటు, పోతురాజుబాబు విగ్రహాన్ని ఊరేగిస్తామన్నారు. ముర్లవానిపాలెంలోని అమ్మ వారి గుడిలో 21న ఆయా విగ్రహాలను ప్రతిష్టించనున్నట్టు పూజారి పోతురాజు తెలిపారు. గ్రామంలో 22న అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమం వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

ఉద్యానవన పంటల సాగుపై అవగాహన



చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో వీర సాయిబాబు

చింతపల్లి: గిరిజన రైతులు ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వీర సాయిబాబు అన్నారు. సోమవారం అమృతం సరోవర్ కార్యక్రమంలో భాగంగా చౌడిపల్లి పంచాయతీ పరిధిలో గల చౌడేపల్లి, గాడిదలు మెట్టు, ధనుంజయ వీధి గ్రామాల్లో రైతులు సాగు చేసే ఉద్యానవన పంటలను సిల్వర్ మొక్కలను చేప పిల్లలను పెంచే చెరువులను తదితర పంటలను పెంచే చెరువులను తదితర పంటలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగపరచుకోవాలన్నారు. ప్రభుత్వాన్ని ఇచ్చినటువంటి ప్రతి కార్యక్రమన్ని గిరిజన రైతులు శ్రద్ధతో పంటలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఏపీవో లక్ష్మీనారాయణమూర్తి, ఈసీ మధుసూదన్ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్, అధ్యాపకులు

అరకులోయటౌన్: స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15న ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం కళాశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించామన్నారు. స్వతంత్ర పోరాటయోధుల చరిత్రను వివరించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మి, పసుపులేటి బాలరాజు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐక్యూఏపీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కొండబాబు, వైస్ ప్రిన్స్‌పాళ్లు డాక్టర్ కె. పుష్పరాజు, పట్టాసి చలపతిరావు, అధ్యాపకులు గణేష్, పి.సుందరిరాణి, ఎస్.రాజు, బి.లచ్చన్న, ఎస్.అప్పారావు, సోంబాబు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలనపై శిక్షణ తరగతులు



శిక్షణ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది

వై.రామవరం: పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ళ సుబ్బలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని డిజిటల్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో నూతన పంచాయతీరాజ్ చట్టం, సర్పంచ్‌లు, కార్యదర్శులు నిర్వహించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. విధులను పారదర్శకతతో నిర్వహిస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన

ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర



పోస్టల్ సేవలపై అంగన్వాడీలకు అవగహన కల్పిస్తున్న పోస్టల్

అరకులోయ టౌన్: తపాలా శాఖ అమలుచేస్తున్న పథకాలపై అంగన్‌వాడీలకు అరకులోయ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పోస్టల్ సేవలపై అవగాహన కల్పించారు. పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశాల మేరకు అరకు మండల పరిషత్ కార్యలయంలోని సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అరకు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి.ఉపేంద్ర పాల్గొని పథకాలను వివరించారు. ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి అంకౌంట్ , పోస్టల్ లైఫ్ ఇన్స్యూరెన్స్, బీమా తదితర పోస్టల్ సేవలను తెలియజేశారు. మండలస్థాయిలో ఉన్న అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో పోస్టల్ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఇందులో భాగంగా ఈ నెల 14న అరకులోయలోని నాలుగు మండలాల్లో 77 పోస్టాఫీసులో ప్రమాద బీమా పాలసీ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీడీపీవో కె.శారద, సూపర్‌వైజర్ అరుణకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.